# 19వ విడత సామాజిక తనిఖీపై నేడు సమన్వయ సమావేశం

**- మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి బి.వి.రవిప్రసాద్**

**ఉరవకొండ, డిసెంబరు 16 ప్రభాతవార్త**

ఉరవకొండ మండలంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జరిగిన పనుల 19వ విడత సామాజిక తనిఖీపై ఈనెల 17వ తేదీన బుధవారం మధ్యాన్నం 3 గంటలకు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సమన్వయ సమావేశం జరుగుతుందని ఎంపీడీవో బి.వి.రవిప్రసాద్, ఎంజీ ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో జి.సుజాత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలన్నారు.

# నేడు ఆధునిక యాజమాన్య పద్ధతులపై అవగాహన సదస్సు

**- వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్.సత్యనారాయణ**

**ఉరవకొండ, డిసెంబరు 16 ప్రభాతవార్త**

వ్యవసాయశాఖ, కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి సిబ్బందికి ఈనెల 17వ తేదీన (నేడు) బుధవారం మధ్యాన్నం 2 గంటల నుండి 5 గంటల వరకు ఉరవకొండ పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధకంలో పాటించాల్సిన ఆధునిక యాజమాన్య పద్దతులపై అవగాహన సదస్సు జరుగుతుందని వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్.సత్యనారాయణ తెలిపారు. మంగళవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. వ్యవసాయశాఖ ఉరవకొండ డివిజన్‌లోని నాలుగు మండలాల్లోగల మండల వ్యవసాయాధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది హాజరుకావాలన్నారు.

# నిస్వార్థ విద్యా వికాస కేంద్రం విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ

**- సామాజిక కార్యకర్త చింతగింజల కేశవ్ ఔదార్యం**



విద్యార్థులకు అట్టలు, పలకలను పంపిణీ చేసిన దృశ్యం

**ఉరవకొండ, డిసెంబరు 16 ప్రభాతవార్త**

పట్టణంలోని గాంధీ చౌక్‌లో నిస్వార్థ విద్యా వికాస కేంద్రంలో శిక్షణ పొందుతున్న ప్రభుత్వ పాఠశాలలో చదువుకొంటున్న విద్యార్థులకు పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త చింతగింజల కేశవ్ మంగళవారం విద్యా సామాగ్రిను పంపిణీ చేశారు. నిస్వార్థ వ్యవస్థాపకులు తాటికొండ వెంకట్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన విద్యార్థులకు తన సొంత డబ్బులతో అట్టలు, పెన్నులు, జియోమెట్రిక్ పెట్టెలు, పఠన సామాగ్రిను పంపిణీచేసి తన ఔదార్యాన్ని చాటుకున్నారన్నారు. ఈ సందర్భంగా చింతగింజల కేశవ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొంటున్న విద్యార్థులకు నిస్వార్థ సంస్థ 4 విద్యా వికాస కేంద్రాలను ఏర్పాటు చేసి చదువు, సంస్కారాలను నేర్పిస్తుండటం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో తనవంతుగా మరింత సహాయ సహకారాలు అందిస్తానన్నారు. తాటికొండ వెంకట్ మాట్లాడుతూ దాతకు కృతజ్ఞతలు తెలిపారు.

# సమన్వయంతో పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం..!

**- టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశంలో ఎంపీడీవో బి.వి.రవిప్రసాద్**

**- మండలంలో 9,863 మంది 0 నుంచి 5 సంవత్సరాలలోపు పిల్లలు**



పల్స్ పోలియో టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో బి.వి.రవిప్రసాద్

**ఉరవకొండ, డిసెంబరు 16 ప్రభాతవార్త**

ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని సమన్వయంతో విజయవంతం చేద్దామని ఎంపీడీవో బి.వి.రవిప్రసాద్ తెలిపారు. పట్టణంలోని స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండలస్థాయి పల్స్ పోలియో టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం జరుగగా ఆయతోపాటు ఎంఈవో ఈశ్వరప్ప, ఉరవకొండ సీహెచ్‌సీ పీపీ యూనిట్ వైద్యురాలు డాక్టర్ సాహితి, రాకెట్ల, కౌకుంట్ల పీహెచ్‌సీల వైద్యాధికారులు డాక్టర్ పావని, డాక్టర్ లక్ష్మీచందన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో బి.వి.రవిప్రసాద్ మాట్లాడుతూ పోలియో చుక్కలు వేయడానికిగాను మండలంలో 0 నుంచి 5 సంవత్సరాలలోపు వయసుగల 9,863 మంది పిల్లలను గుర్తించడం జరిగిందన్నారు. వారికి తొలిరోజు 21వ తేదీన 54 పోలియో కేంద్రాల్లో పోలియో చుక్కలు వేయడం జరుగుతుందన్నారు. 22, 23 తేదీల్లో ఇంటింటికి వెళ్లి పిల్లలకు పోలియో చుక్కలు వేయాలన్నారు. లక్ష్యానికి అనుగుణంగా పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని పకడ్బందీగా పూర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాకెట్ల, పి.కౌకుంట్ల పీహెచ్‌సీల డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్లు మహమ్మద్ షఫీ, వెంకటరమణ, సూపర్‌వైజర్లు, శేఖర్, యుగంధర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# కుక్కల దాడిలో మహిళకు గాయాలు


**ధర్మవరంటౌన్, డిసెంబరు 16 ప్రభాతవార్త**



కుక్కదాడిలో గాయపడిన పద్మావతి

పట్టణంలోని లక్ష్మీచెన్న కేశవపురంకు చెందిన పద్మావతి అనే మహిళపై కుక్కలు దాడిచేసి తీవ్రంగా గాయపరిచాయి. స్థానికులు, బాదితురాలు తెలిపినవి వరాల మేరకు....పద్మావతి అనే మహిళ లక్ష్మీచెన్నకేశవపురంలో నడుచుకుంటూ వెళ్తుండగా రోడ్డుపై ఉన్న కుక్కలు ఒక్కసారిగా దాడిచేసి తీవ్రంగా గాయపరిచాయి. దీంతో ఆమెను స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పట్టణంలో ఉన్న కుక్కలను లక్ష్మీచెన్నకేవపురం, తుంపర్తికాలనీల్లో వదిలివెళ్తున్నారని ఇవి ఎర్రగుంట సర్కిల్ నుండి తుంపర్తి కాలనీ వరకు ప్రధాన రహదారిలో గుంపులు గుంపులుగా రోడ్డుమీదనే తిరుగుతుండడంవల్ల మోటార్ సైకిళ్లు,కార్లు, యాక్సిడెంట్లు ఎక్కువగా జరుగుతున్నాయి యాక్సిడెంట్లలో చాలామంది ప్రాణాలు కూడా కోల్పోయారు, కాళ్లు చేతులు విరిగిపోయాయి స్థానికులు వాపోయారు. అధికారులు,నాయకులు స్పందించి ఎర్రగుంట సర్కిల్ నుండి తుంపర్తి కాలనీ వరకు ఉన్న కుక్కలను దూరంగా వదిలేలా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు ఈ రెండు కాలనీల్లో దాదాపు 700 కుక్కలు ఉన్నాయని. ఈ కుక్కలు ఎప్పుడు ఎటువైపు నుంచి వచ్చి దాడి చేస్తాయోనని భయంగా ఉందని స్థానికులు వాపోయారు. కావున మున్సిపల్ అధికారులు స్పందించి వీధి కుక్కలను పట్టణానికి దూరంగా వదిలేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# తోలుబొమ్మల కళాకారిణి శివమ్మకు పరిటాల సునీత, శ్రీరామ్ అభినందనలు...



క్యాంపు కార్యాలయంలో శివమ్మను సత్కరించిన పరిటాల సునీత, శ్రీరామ్

**ధర్మవరం రూరల్ డిసెంబర్ 16 ప్రభాతవార్త**

తోలుబొమ్మల కళాకారిణి శివమ్మ ధర్మవరం ఖ్యాతిని దేశమంతా తెలుసుకునేలా చేశారని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ తెదేపా ఇన్చార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. ధర్మవరం మండలం, నిమ్మలకుంట గ్రామానికి చెందిన తోలుబొమ్మల కళాకారిణి డి.శివమ్మ గారు ప్రఖ్యాత జాతీయ"శిల్పగురు" అవార్డును అందుకున్నారు. 2025, డిసెంబర్ 9వ తేదీన న్యూడిల్లీ లోని, విజ్ఞాన్ భవన్ లో జరిగిన హస్తకళల జాతీయ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో శివమ్మ భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. ఈ నేపథ్యంలో పరిటాల శ్రీరామ్, పరిటాల సునీత అనంతపురం క్యాంప్ కార్యాలయంలో శివమ్మని సత్కరించారు. స్థానిక నాయకులతో కలిసి శాలువాతో సత్కరించి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తోలుబొమ్మలాట అన్నది మన సంస్కృతిలో ఒక భాగం అన్నారు. అయితే కాలక్రమంలో ఈ కళ అంతరించిపోయే ప్రమాదంలో పడిందన్నారు. ఇలాంటి సమయంలో నిమ్మలకుంట వాసులు ఈ కళను మళ్లీ బ్రతికించి ప్రాణం పోశారన్నారు. వంశపారంపర్యంగా దీనిని ఆదాయ వనరుగా చూడకుండా వారు కొనసాగించడం అభినందనీయమన్నారు. ఇప్పటికే తోలుబొమ్మలాటకు జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చారన్నారు. ఇప్పుడు శివమ్మ ప్రతిష్టాత్మకమైన శిల్ప గురు అవార్డు అందుకోవడం ధర్మవరం ప్రాంతానికి గర్వకారణంగా ఉందన్నారు.

# కూలి ప్రమాదం జరిగితే గాని పట్టించుకోరా..?

**రొళ్ల డిసెంబర్ 16 ప్రభాతవార్త:**



కూలడానికి సిద్ధంగా ఉన్న చెట్టు

మండల కేంద్రంలోని మడకశిర రోడ్డులో ఆర్ అండ్ బి ప్రధాన రహదారులకు ఆనుకొని ఉన్న ఎడువారి జీవి భారీ చెట్టు ప్రమాదకరంగా మరిది.ఎప్పుడు ఏక్షణాన కూలుతాయో తెలియని పరిస్థితి నెలకొంది . వాహనదారులు, ప్రయాణికులు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగించాల్సి వస్తోంది. వాటిని ఆర్అండ్ బీ శాఖాధికారులు తొలగించకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఎండిన చెట్లు కూలితే గాని పట్టించుకోరా? అని అధికారులపై స్థానికులు మండిపడుతున్నారు.

# స్కేటింగ్ పోటీలలో నైరా ఎరుడైట్ పాఠశాల విద్యార్థి ప్రతిభ..!

**ధర్మవరం రూరల్ డిసెంబర్ 16 ప్రభాతవార్త**



స్కేటింగ్ పోటీలలో గెలుపొందిన విద్యార్థిని అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

మండల పరిధిలోని నైరా ఎరుడైట్ పాఠశాల విద్యార్థి గౌరీశంకర్ మొన్నటి రోజు ఆదివారం 14 తేదీన విశాఖపట్నం లో జరిగిన మొదటి ఎండురెన్స్ ఓపెన్ స్టేట్ లెవెల్ స్కేటింగ్ చాంపియన్షిప్ లో ఒన్ మినిట్ రేస్ లో సిల్వర్ మెడల్ సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ శ్వేత మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మా పాఠశాలలో విద్య తో పాటు క్రీడలకు కూడా అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని దీంతో గౌరీ శంకర్ స్కేటింగ్ పోటీలలో 20 సెకండ్స్ రేస్ లో బ్రోంజ్ మెడల్ సైతం సాధించడం జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో క్రీడారంగం పోటీల్లో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహ్నా చి ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థికి సూచించారు.అనంతరం పాఠశాలలో విద్యార్థి గౌరీ శంకర్ ను పాఠశాల యాజమాన్యం విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటేష్, భార్గవ్, ఉపాధ్యాయులు విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారి ఆరోగ్యసమస్యపై మంత్రి ఆరా

**ధర్మవరంటౌన్, డిసెంబరు 16 ప్రభాతవార్త**



చిన్నారి ఆరోగ్యసమస్యపై కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న హరీశ్ బాబు

ధర్మవరం పట్టణానికి చెందిన పేదచేనేత కార్మికులు జిహావేశ్వర, లక్ష్మీదంపతుల కుమార్తె జీవిత తీవ్ర అనారోగ్యంతో బాదపడుతున్న విషయం ఇటీవల రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్యాదవ్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన మంత్రి చిన్నారి కుటుంబానికి అవసరమైన సహాయం అందేలా చూడలని నియోజకవర్గ బీజేపీ ఇన్చార్జ్ హరీశ్ బాబును ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు మంగళవ్వార చిన్నారి ఇంటికివెళ్లి చిన్నారి కుటుంబసభ్యులను పరామర్శించి చిన్నారి ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు. అనంతరం మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం తరపున అన్ని విదాల సహకారం అందిస్తామని, తక్షన వైద్యసహాయం అందేలా సంబంధిత వైద్యశాఖ అదికారులు, ఆస్పత్రి యాజమాన్యంతో సమన్వయ చేస్తామని ఆయన చిన్నారి కుటుంబసభ్యులకు భరోసా ఇచ్చారు.

# రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంపచెట్లను తొలగించిన కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు

**బ్రహ్మ సముద్రం డిసెంబర్ 16 ప్రభాతవార్త**



జెసిబి తో కంపచెట్లను తొలగిస్తున్న దృశ్యం

కళ్యాణ దుర్గం శాసన సభ్యులు అమి లి నేని సురేంద్ర బాబు ఆదేశాల మేరకు మండల పార్టీ అధ్యక్షుడు పాలబండ్ల శ్రీ రాములు బ్రహ్మ సముద్రం మండల పరిధిలో గ లగొల్లపల్లి నుండి పాల వెంకటావురంగ్రామం వరకు రోడ్డు కి ఇరువై పులాఉన్న కంపచెట్లను ప్రజలకు ఇబ్బంది కలుగకుండా దగ్గరుండి జె సి బి తో తొలగింప చేసి కల్వర్టు నూసైతం రిపేరుచేయించారు.

# జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మైకు సెట్ వితరణ



పాఠశాల ఉపాధ్యాయులకు మైక్ సెట్‌ను అందజేస్తున్న దృశ్యం

**బెలుగుప్ప, డిసెంబర్ 16 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్‌కు మైక్ సెట్‌ను తెలుగు యువత జిల్లా అధ్యక్షులు తమ్మినేని పవన్, తెలుగుదేశం పార్టీ నాయకులు మాదినేని నరేంద్ర చౌదరి, నరసింహులు, తలారి గోపాల్, మాదినేని సాగర్, మాదినేని రవి, కోనంకిసోము, గెన్నె లక్ష్మినారాయణ, సూరప్ప, నారాయణ, పరమేష్, సత్యప్పలు వితరణచేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్థికశాఖ మంత్రి పయ్యావులకేశవ్, టిడిపి సీనియర్‌నాయకులు పయ్యావుల శ్రీనివాసులు ఆశీస్సులతో పాఠశాలకు మైక్ సెట్‌ను వితరణ చేస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా 2025-26 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థికి రూ.5వేలు పారితోషికంగా మాదినేని సాగర్ ప్రకటించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సి.రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, పాఠశాల చైర్మన్ బి.వెంకటేష్, ప్రాథమిక పాఠశాల చైర్మన్ తలారి సురేష్, విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# ప్రభుత్వ పాఠశాలలో ఆధార్ కేంద్రాల ఏర్పాటు

**గుత్తి, డిసెంబర్ 16 ప్రభాతవార్త**



ఎంపిడిఒ ప్రభాకర్‌నాయక్

మండల వ్యాప్తంగా ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలల్లో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపిడిఒ ప్రభాకర్‌నాయక్ తెలిపారు. 16, 17న బేతాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, 18,19న పెద్దొడ్డి పాఠశాలలో, అదేవిధంగా 20న రజాపురం గురుకుల పాఠశాలలో, 22న తొండపాడు, 24న ఊబిచర్ల పాఠశాలల్లో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీటిలో ఆధార్ నమోదు, తప్పులను సరిదిద్దుకోవచ్చన్నారు. ఈ ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# వెంకటేశ్వరునికి...తెలుగు తమ్ముళ్ల దీవెనలు..హైవేలో అభినందనలు

**-రాష్ట్ర టిడిపి నేత, మంత్రి భర్త, వెంకటేశ్వరరావుకు పాలసముద్రం వద్ద జన్మదిన వేడుకలు**

**-మండల కన్వీనర్ బాలకృష్ణచౌదరి, నిమ్మల శ్రీధర్, నరేష్, నాగేనాయక్, అచ్చుత్, చంద్ర, అశోక్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్**

**గోరంట్ల, డిసెంబర్ 16 ప్రభాతవార్త**



జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న మండల కన్వీనర్

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నేత రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ భర్త వెంకటేశ్వరరావు జన్మదినాన్ని పురస్కరించుకొని గోరంట్ల మండల పరిధిలోని పాలసముద్రం జాతీయ రహదారిలో హోటల్ వద్ద గోరంట్ల మండలం



జన్మదిన వేడుకల్లో కూటమి నాయకులు

కూటమి నాయ కులు మంగళవా రం ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. రాష్ట్ర టిడిపి నేత వెంకటేశ్వరరావు బెంగళూరు నుంచి పెనుకొండకు రోడ్డు మార్గాన వెళుతున్న నేపథ్యంలో సమాచారం తెలుసుకున్న గోరంట్ల మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ బాలకృష్ణచౌదరి, జనసేన పార్టీ మండల అధ్యక్షులు సంతోష్‌కుమార్ స్థానిక సింగిల్ విండో అధ్యక్షులు బెల్లాలచెరువు చంద్ర, నిమ్మల శ్రీధర్, సర్పంచు సరోజా నాగేనాయక్, జీనం నరేష్, పచ్చ అశోక్, అచ్చుత్‌నాయుడు, గుమ్మయ్యగారిపల్లి హరి, స్టేట్ డైరెక్టర్ సోమశేఖర్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ తిరుపాల్, ఉత్తమరెడ్డి, నిడిమామిడప్ప తదితరుల ఆధ్వర్యంలో నేషనల్ హైవే మిషన్ తాండ వద్ద గల హోటల్ వద్ద కేక్ కట్ చేసి వెంకటేశ్వరరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ నాయకులు ప్రత్యేకంగా తయారు చేయించిన కేక్‌ను కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుతూ వెంకటేశ్వరరావుకు శుభాకాంక్షలు తెలియజేస్తూ శాలువాలు, పూలమాలలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల నాయకులు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ దేవాంగం శ్రీనివాసులు, కురుబ మహేంద్ర, గిరిధర్‌గౌడ్, పసుపులేటి శ్రీనివాసులు, ఆగిసం నాగరాజు, వట్టే సుధాకర్, అజంతుల్లా, సుభహన్, సింగిల్ విండో డైరెక్టర్ నబీ రసూల్, కలీం, జనసేన నాయకులు కావేరి, గోవిందప్ప, గాజుల రమేష్, కాలనీ శ్రీనివాసులు, ప్రతాప్‌చౌదరి, పాలసముద్రం మనోహర్, మూర్తి, జయచంద్రారెడ్డి, సుబ్బరాయుడు, కమ్మవారిపల్లి వెంకటేశు, తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందచేసిన దృశ్యం

**లేపాక్షి, డిసెంబర్ 16 ప్రభాతవార్త**

మండల పరిధిలోని కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్‌ను టీచర్ అశ్వర్థ అందజేశారు. హెచ్ఎం ప్రకాష్ ఆధ్వర్యంలో పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పదవ తరగతి విద్యార్థుల పరీక్షలకు అవసరమైన స్టడీ మెటీరియల్ ప్రాధాన్యతను వివరించి విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్తమ మార్కులు సాధించేందుకు వీలుగా యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం స్టడీ మెటీరియల్ తయారు చేయడం జరిగిందన్నారు. ఈ స్టడీ మెటీరియల్‌ను బాగా చదివి పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించాలన్నారు. చదువులో ఉన్నత స్థాయికి ఎదగాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీరాములు, నాగరాజు, మునావర్, రవికుమార్, మంజుల, వాణి, యుటిఎఫ్ నాయకులు సురేష్, క్షీరలింగేశ్వర, రమణ, ఆంజనేయులు, మురళీ, తదితరులు పాల్గొన్నారు.

# కొండూరులో ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం

**లేపాక్షి, డిసెంబర్ 16 ప్రభాతవార్త**



వైద్యపరీక్షలకు హాజరైన దృశ్యం

లేపాక్షి మండల ప రిధి లో ని కొండూరు గంగమ్మ గుడి ఆవరణంలో మంగళవారం ఉచిత మెగా ఆయుర్వేద వైద్య శిబిరాన్ని డాక్టర్ సాహితి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో భాగంగా దాదాపు 150 మందికి ఉచిత ఆయుర్వేద వైద్య చికిత్సలు నిర్వహించారు. శిబిరంలో మధుమేహం, రక్తపోటు, కీళ్లవాతము, మోకాళ్ళ నొప్పులు, చర్మవ్యాధులు, ఆస్తమా, అలర్జీ, స్త్రీ సంబంధిత వ్యాధులు, దగ్గు, జలుబు, అజీర్ణం, గ్యాస్ సమస్యలు, సయాటికా, మొదలైన వ్యాధులకు చికిత్సలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సాహితి మాట్లాడుతూ అన్ని వ్యాధులకు ఆయుర్వేదంలో మందులు ఉన్నాయన్నారు. శాశ్వత రోగ నివారణకు ఆయుర్వేద ఔషధం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. లేపాక్షి ప్రభుత్వ ఆసుపత్రిలో ఆయుష్ వైద్యశాల ఉందని వ్యాధిగ్రస్తులు ఆయుర్వేద వైద్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో కాంపౌండర్ ఇరగంరెడ్డి, యోగా శిక్షకురాలు కృష్ణవేణి, ఆశా వర్కర్లు లలిత, గంగాదేవి, తదితరులు పాల్గొన్నారు.

# కట్నం కోసం వేధింపులపై..భర్త, అత్త,మామలపై కేసునమోదు

**ధర్మవరంటౌన్, డిసెంబరు 16 ప్రభాతవార్త**

వరకట్నం తీసుకురావాలని వేధింపులతో పాటు అనుమానంతో తరచూ మానసికంగా వేధిస్తున్నారంటూ తారకరామాపురంకు చెందిన ఉప్పర నందిని ఇచ్చిన పిర్యాదుమేరకు భర్త, అత్తమామలపై కేసు నమోదు చేసినట్టు టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. సీఐ రెడ్డప్ప తెలిపిన వివరాల మేరకు...పట్టణంలోని తారకరామాపురంకు చెందిన నందిని హిందూపురం మండలం బిరెపల్లి గ్రామానికి చెందిన రామలింగయ్య కుమారుడు ఉప్పర మంజునాథుకు ఇచ్చి 6సంవత్సరాలక్రితం వివాహంచేశారు. ఆ తరువాత నందిని భర్త ఉప్పర మంజునాథ్ బెంగళూర్ లో ఐసీఐసీఐ బ్యాంకులో కాంట్రాక్టర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. నందిని కూడా ఎస్ఎఫ్ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగంచేస్తుంది. ఆ తరువాత మంజునాథ్ బార్యపై అనుమానం పెంచుకుని తరచూ మద్యం సేవించి మానసికంగా శారీరకంగా వేధిస్తూ ఇంటిలోకి ఖర్చులకు డబ్బులు ఇవ్వకుండా బార్య బంగారమంతా బ్యాంకులో కొదవ పెట్టాడు. అయిన భర్తలోమార్పు వస్తుందని సర్దుకుపోయింది. పైగా నందిని అత్త,మామలుకూడా కుమారుడుకే మద్దతు పలుకుతూ పెళ్లి సమయంలో మీ తల్లిదండ్రులు డబ్బులు ఇవ్వలేదు కట్నంకింద డబ్బులు తీసుకురావాలని నానాదుర్భాషలాడుతూ దాడిచేశారు. దీంతో నందిని పుట్టినిల్లు అయి న ధర్మవరంకు వచ్చి జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేసింది. అయినా మంజునాథ్ నందిని కి పోన్చేసి కట్నంగా డబ్బులుతీసుకురావాలని లేదా చం పుతానని బెదిరించారు. దీంతో చివరికి నందిని తల్లిదండ్రులతో కలిసి మంగళవారం టూటౌన్ పోలీసులకు భర్త, అత్త,మామలపై పిర్యాదు చేసింది. దీంతో ఆమె పిర్యాదు మేరకు భర్త ఉప్పర మంజునాథ్, అత్త ఉప్పర అలవేళమ్మ, మామ ఉప్పర రామలిం గయ్యలపై కేసు నమోదు చేసినట్టు సీఐతెలిపారు.

# మంత్రి సత్యకుమార్ యాదవ్ చొరవతో... కార్డియాక్ ఫెయిల్యూర్ బాదిత మహిళకు ఎన్టీఆర్ వైద్యమిత్రకింద వైద్యం

**ధర్మవరంటౌన్, డిసెంబరు 16 ప్రభాతవార్త**



దేవరకొండ భాగ్యలక్ష్మి

ధర్మవరంకు చెందిన దేవరకొండభాగ్య లక్ష్మి అనే మహిళ రెండేళ్ల క్రితం కార్డియాక్ ఫెయిల్యూరు గురైనట్టు కుటుంబసభ్యులు తెలిపారు. ఇటీవల ఆమె ఆరోగ్యపరిస్థితి అత్యంత విషమంగా మారడంతో ఈ నెల 9వతేదీన అనంతపురం సవేరా ఆస్పత్రిలో ఆమెను అత్యవసరంగా అడ్మిట్ చేశారు. అయితే కార్డియాక్‌ఫెయిల్యూర్కు సంబంధించిన చికిత్సలు ఎన్టీఆర్ వైద్య మిత్ర పథకం కింద అందించడం కుదరదని ఆస్పత్రి సిబ్బంది కుటుంబసభ్యులకు తెలిపారు. దీంతో తీవ్ర ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు వెంటనే ఈ విషయాన్ని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్యాదవ్ కార్యాలయానికి వెళ్లి తెలియజేశామన్నారు. వెంటనే స్పందించినమంత్రి కార్డియాక్ ఫెయిల్యూర్ కు సంబంధించిన వైద్యచికిత్సలను ఎన్టీఆర్ ఖివైద్య మిత్ర పథకంకిందనే అందించాలని ఆస్పత్రి అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు సవేరా ఆస్పత్రి వైద్యులు వెంటనే చికిత్సలు చేయించారన్నారు.దీంతో మంత్రి సత్యకుమార్యాదవ్‌కు బాగ్యలక్ష్మి, కుటుంబసభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఆవు దూడల పై చిరుత దాడి

**కంబదూరు, డిసెంబర్ 16, ప్రభాతవార్త**

కంబదూరు మండలం తిమ్మాపురంలో రైతు రామకృష్ణకు చెందిన రెండు ఆవు దూడలను చిరుత దాడి చేసి హతమార్చింది. ఈ ఘటన మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకున్నట్లు బాధిత రైతు తెలిపారు. ఇటీవల కాలంలో చిరుతల సంచారం అధికమైందన్నారు. గతంలో కూడా ఐదు ఆవులను చిరుత హతమార్చినట్లు తెలిపారు.చిరుత దాడిలో 20 వేల రూపాయిలు నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ఫారెస్ట్ అధికారులు స్పందించి చిరుతలను బంధించి అడవి ప్రాంతంలో వదిలి పెట్టాలని కోరారు. చిరుత సంచారంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని చెప్పారు. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు సెక్షన్ ఆఫీసర్ మల్లికార్జున, బీట్ ఆఫీసర్ సూర్యనారాయణ , జంతు సంరక్షణ సహాయకులు ఘటన స్థలాన్ని పరిశీలించి రైతుకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

# మొక్కజొన్న కంకులు తిని 12 గొర్రెల మృతి..

**కొత్తచెరువు డిసెంబర్ 16 ప్రభాత వార్త**



మొక్కజొన్న కంకులు తిని మృతి చెందిన గొర్రెల దృశ్యం

కొత్తచెరువు మండల పరిధిలోని మర కుంటపల్లి గ్రామ సమీపంలో మంగళవారం ఓ రైతు పొలంలో గొర్రెలు మొక్కజొన్న కంకులు తిని మృత్యువాత పడ్డాయని గొర్రెల కాపరి చిన్న హనుమంతు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు గొర్రెల కాపరి తెలిపిన వివరాలు మేరకు గ్రామ సమీపంలో ఓ మొక్కజొన్న పంట కాలం పూర్తి అయి దుక్కి దున్ని చేయడం జరిగింది అయితే అదే గ్రామానికి చెందిన గొర్రెల కాపరి చిన్న హనుమంతుకి దాదాపు 70 గొర్రెలు ఉన్నాయి వాటిలో చాలా గొర్రెలు దుక్కి చేసిన పొలంలోకి 12 గొర్రెలు వెళ్లి ఆ పొలంలో ఉన్న మొక్కజొన్న కంకులను తినడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు గొర్రెలు కాపరి తెలిపారు తనకున్న గొర్రెలతోనే తన కుటుంబ పోషణ చేసుకునేవాడిని అన్నారు ఒక్కసారిగా ఇన్ని గొర్రెలు మృత్యువాత పడటంతో గొర్రెలు కాపరి తీవ్ర ఆవేదనకు గురయ్యారు పశు వైద్య సిబ్బంది వచ్చి మిగతా గొర్రెలకు ప్రాణాపాయం జరగకుండా గొర్రెలకు మందులు ఇంజక్షన్లు ఇవ్వడం జరిగిందన్నారు మృత్యువాత పడిన 12 గొర్రెలు దాదాపు లక్ష 30 వేలు వేల ఉంటాదని ఆవేదన వ్యక్తం చేశారు గ్రామస్తులు బంధువులు గొర్రెల కాపరి కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

